పీపీపీ వద్దు బాబూ..

- మార్కాపురం మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్వహించాలి
- నినదించిన వైఎస్సార్ సీపీ శ్రేణులు


అన్నా రాంబాబు

మార్కాపురం/తర్లుపాడు: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మార్కాపురం మండలం రాయవరం వద్ద నిర్మించి సుమారు 70 శాతం పూర్తయిన మెడికల్ కళాశాలను కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో ప్రైవేట్‌కు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ విద్యార్థి, యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. వైఎస్సార్ సీపీ దర్శి, యర్రగొండపాలెం ఎమ్మెల్యేలు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల ఇన్‌చార్జిలు అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి, దద్దాల నారాయణయాదవ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రభుత్వ తీరుపై నిరసనం వ్యక్తం చేశారు. ఎండను సైతం లెక్కచేయకుండా కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, పీపీపీ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వమే మెడికల్ కాలేజీని నిర్మించాలని నినదించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి చెంచిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, పోలింగ్ బూత్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి పత్తి రవిచంద్ర, మార్కాపురం పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సలీమ్, కౌన్సిలర్లు డాక్టర్ కనకదుర్గ, ముంగమూరి శ్రీను, సిరాజ్, ఉత్తమ్ కుమార్, రోజ్‌లిడియా, పోరుమామిళ్ల విజయలక్ష్మి, డాక్టర్ మగ్బుల్ బాషా, నజీర్ అహ్మద్, కరీముల్లా, ఉస్మాన్, పార్టీ జిల్లా నాయకులు బట్టగిరి తిరుపతిరెడ్డి, జవ్వాజి రంగారెడ్డి, జంకె వెంకట నారాయణరెడ్డి, జంకె చిన్న వెంకటరెడ్డి, మోహన్‌రెడ్డి, బొగ్గరపు శేషయ్య, మల్లిక, తుమ్మా వెంకటరెడ్డి, గొలమారి శివారెడ్డి, బొమ్మిరెడ్డి బాలకృష్ణారెడ్డి, మందటి మహేశ్వరరెడ్డి, పంబి వెంకటరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కూరాటి చెన్నకేశవులు, గుంజె గురవయ్య తదితరులు పాల్గొన్నారు.


మెడికల్ కాలేజీ వద్దకు వెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

గిద్దలూరు నుంచి భారీగా తరలిన నాయకులు

బేస్తవారిపేట: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మార్కాపురంలో చేపట్టిన చలో మెడికల్ కాలేజీ నిరసన కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి భారీగా వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. బేస్తవారిపేట మండలం నుంచి ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆవుల శ్రీధర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెన్నా భాస్కర్‌రెడ్డి, పంచాయతీరాజ్ విభాగం కన్వీనర్ మల్లెల శేఖర్‌రెడ్డి, యూత్ కన్వీనర్ మాచర్ల వెంకటేశ్వరరెడ్డి, అర్ధవీడు మండలం నుంచి ఎంపీపీ మేడూరి వెంకట్రావ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఏరువ రంగారెడ్డి, పంచాయతీరాజ్ విభాగం కన్వీనర్ రవికుమార్‌యాదవ్, గిద్దలూరు మండలం నుంచి మాజీ ఎంపీపీ కడప వంశీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నగర పంచాయతీ అధ్యక్షులు మానం బాలిరెడ్డి, మండల కన్వీనర్ బి.ఓబులరావు, నాయకులు పాలుగుల్ల నరసింహారెడ్డి, చేరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, కొమరోలు మండలం నుంచి జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకట నాయుడు, మండల కన్వీనర్ కే రవికుమార్, నాయకులు వెంకటేశ్వర్లు, చేదుళ్ల రమణారెడ్డి, కంభం మండలం నుంచి వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ సెక్రటరీ గఫార్ అలీ ఖాన్, ఉప సర్పంచ్ సయ్యద్ ఖాశీం, రాచర్ల మండలంలో మండల కన్వీనర్ యేలం మురళీకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు పగడాల దేవి, రైతు విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ సూర స్వామిరంగారెడ్డి తరలివెళ్లారు.


మెడికల్ కాలేజ్ సందర్శనకు భారీగా హాజరైన ప్రజలు, నాయకులు



మెడికల్ కాలేజీ నిర్మాణాల వద్ద వైఎస్సార్ సీపీ శ్రేణుల జోష్.


మండే ఎండలో ర్యాలీగా కదం తొక్కుతూ..


కేపీ నాగార్జునరెడ్డితో కంభం మండల నాయకులు


మార్కాపురం మెడికల్ కాలేజీ వద్ద బేస్తవారిపేట మండల నాయకులు

క్లుప్తంగా

రేపు సర్వసభ్య సమావేశం

అర్ధవీడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.వీరరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ఎంపీపీ మేడూరి వెంకటరావు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిదులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలో ఆర్‌డీఎస్‌ఎస్ పనుల నేపథ్యంలో పుల్లారెడ్డిపల్లె, యర్రంశెట్టివానిపల్లె, బాలిరెడ్డిపల్లె, చింతలపల్లె, వర్ధనపల్లె గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి, సిబ్బందికి సహకరించాలని కోరారు.

నాగంపల్లిలో వైద్య పరీక్షలు

కొనకనమిట్ల: మండలంలోని నాగంపల్లి గ్రామంలో శుక్రవారం గొట్లగట్టు పీహెచ్‌సీ డాక్టర్ ఎస్పీ.బాలయ్య ఆధ్వర్యం వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించి రక్త పరీక్షలు చేయడంతోపాటు అవసరమైన వారికి మందులు అందజేశారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని అవగాహన గ్రామస్తులకు కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కోండ్రు వెంకటేశ్వర్లు, ఎంపీహెచ్‌ఈఓ నారాయణరెడ్డి, ఎంపీహెచ్‌ఎస్ జె.వెంకటేశ్వర్లు, విజయకుమారి ఏఎన్‌ఎం షమీమూన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీని, గొట్టిపడియ గ్యాప్‌ను పరిశీలించిన కలెక్టర్


మెడికల్ కళాశాల వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు, పక్కన అధికారులు

మార్కాపురం టౌన్: మార్కాపురం మండలంలోని గొట్టిపడియ గ్యాప్‌ను, రాయవరం వద్ద ఉన్న మెడికల్ కాలేజీని కలెక్టర్ రాజాబాబు పరిశీలించారు. గొట్టిపడియ గ్యాప్ వద్ద ఇన్‌టెక్ వెల్ ద్వారా జిల్లాలోని పశ్చిమ ప్రాంత ప్రజలకు మంచినీటి సరఫరా పథకం పనులను పరిశీలించి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాయవరం వద్ద ఉన్న మెడికల్ కళాశాల నిర్మాణాలను పరిశీలించారు. కళాశాల నిర్మాణ పనులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈయన వెంట సబ్‌కలెక్టర్ త్రివినాగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బాలశంకర్‌రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి, సత్యనారాయణ, సీతారామిరెడ్డి, తహశీల్దార్ చిరంజీవి పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


పొదిలికి చేరిన యూటీఎఫ్ రణభేరి యాత్ర

పొదిలి: ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు ఎస్‌కె.అబ్దుల్‌హై డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన చేపట్టిన రణభేరి యాత్ర శుక్రవారం పొదిలికి చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. పీఆర్సీ అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలంటే ఉపాధ్యాయులకు కేవలం బోధన పనులు మాత్రమే ఉండాలన్నారు. రణభేరి యాత్రకు పలువురు ఉపాధ్యాయులు మద్దతు పలికారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎస్.రవి, బుజ్జిబాబు, కేవీ నారాయణ, నాగరాజు, శైలజ, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి, జి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచాలి


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని ఎంఈవో ఎండీ ఖాసిం అన్నారు. మండలంలోని వెంకటరెడ్డిపల్లి, యండ్రపల్లి ఎంపీపీ పాఠశాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు. అనంతరం ఎండీఎంలను తనిఖీ చేసి మాట్లాడుతూ విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచడంతో పాటు రాయడం, చదవడం నేర్పించాలని చెప్పారు. విద్యార్థులకు అర్థమయ్యేలా సులభ పద్ధతిలో బోధించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ నియమాలను అనుసరించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని చెప్పారు. పాఠశాల, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.

ప్రభుత్వానికి ఉపాధ్యాయుల సమస్యలు పట్టడంలేదు


మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హై

బేస్తవారిపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటుతున్నా ఉపాధ్యాయరంగ సమస్యలు పట్టడం లేదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌హై పేర్కొన్నారు. ఉపాధ్యాయ రంగ సమస్యలు పరిష్కరించాలంటూ యూటీఎఫ్ చేపట్టిన రణభేరి జాతా శుక్రవారం బేస్తవారిపేటకు చేరింది. ఎన్నికల సమయంలో ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరిస్తామని హామీలిచ్చి నెరవేర్చలేదన్నారు. కనీసం ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నేతలతో మాట్లాడేందుకు ముఖ్యమంత్రికి తీరిక ఉండటంలేదన్నారు. జిల్లా యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు రవి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులపై పని భారం మోపడం సరికాదని, డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని, పీఆర్సీని అమలు చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 25న విజయవాడలో జరిగే భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఐవీ రామిరెడ్డి, యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.ఖాశింవలి, ఎస్.లక్ష్మీరెడ్డి, కె.సునీల్‌కుమార్, షేక్ ఖాశీం బాషా, ఎ.తిరుపతిరెడ్డి, సీనియర్ నాయకులు కె.అంకిరెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు వైద్యం నామమాత్రం!

కొమరోలు: కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు తలపెట్టిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం గ్రామాల్లో మొక్కుబడి తంతుగా మారిపోయింది. కొమరోలు, రాజుపాలెం పీహెచ్‌సీల పరిధిలో వైద్యశిబిరాల నిర్వహణ మరీ తీసికట్టుగా మారింది. కొమరోలులోని గ్రామ సచివాలయం–2 పరిధిలో శుక్రవారం కొమరోలు పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సచివాలయం–2 పరిధిలో దాదాపు 2300 మంది మహిళలు ఉన్నప్పటికీ పట్టుమని 10 మంది కూడా పాల్గొనలేదంటే కార్యక్రమం ఎలా సాగుతోందో అవగతమవుతోంది. అది కూడా అప్పటికప్పుడు ఆశా కార్యకర్తలు ఉరుకులు పరుగుల మీద ఇంటింటికీ వెళ్లి మహిళలను బతిమలాడటం గమనార్హం. వైద్య శిబిరాల నిర్వహణపై ముందస్తుగా ప్రజలకు అవగాహన కల్పించకపోవడంతో ఎవరూ పాల్గొనలేదు.


కొమరోలులో వైద్య ఆరోగ్య సిబ్బందితో నిండిపోయిన కార్యక్రమం

ఉపాధ్యాయులపై మరింత భారం..

సమస్యలకేదీ పరిష్కారం?


మార్కాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

- మార్కాపురం రణభేరిలో యూటీఎఫ్ నాయకులు

మార్కాపురం టౌన్: ఉపాధ్యాయులకు సంబంధించి ఆర్థిక, విద్యారంగ సమస్యలను యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే అబ్దుల్ హై పేర్కొన్నారు. యూటీఎఫ్ రాష్ట్రశాఖ పిలుపు మేరకు రణభేరి కార్యక్రమాన్ని యూటీఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడచినా ఏ ఒక్క సమస్యకు పరిష్కారం లభించలేదన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా బోధనేతర పనులు ఎక్కువగా చేయిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం యాప్స్‌ను తగ్గిస్తామని చెప్పి ఇంకా పెంచిందని, దీంతో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఆర్థిక పరమైన ఒక్క సమస్య కూడా పరిష్కారానికి నోచుకోలేదని, పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని, నాలుగు డీఏలు చెల్లించాలని, పెండింగ్ బకాయిలు, పీఎఫ్ లోన్లు, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్ బకాయిలు సుమారు 18 వేల కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఎస్.రవి, రాష్ట్ర నాయకులు ఓవీ వీరారెడ్డి, జిల్లా కార్యదర్శులు శ్రీరాములు, వెంకటేశ్వర్లు, నాయకులు ప్రభాకర్, పాపయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, జయరామిరెడ్డి, రాజేష్, వెంకటరెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, పిచ్చిరావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.


పశువుల తొట్టి శుభ్రం


నీటి తొట్టి వద్ద రైతులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ

సాక్షి ఎఫెక్ట్..

కంభం: పశువుల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్లలో కొందరు వ్యక్తులు గేదెలు శుభ్రం చేస్తుండటంతో ఆ తర్వాత వచ్చిన మూగజీవాలు తాగేందుకు మంచినీరు లేకుండా పోతోంది. ఈ విషయమై ఈనెల 18వ తేదీన ‘నీటి తొట్ల నిర్వహణలో నిర్లక్ష్యం’ శీర్షికన ‘సాక్షి’లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీడీఓ వీరభద్రాచారి, ఏపీఓ జీవరత్నం శుక్రవారం జగనన్న కాలనీ సమీపంలో ఉన్న నీటి తొట్టిని శుభ్రం చేయించి, స్థానిక రైతులకు అవగాహన కల్పించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు


క్లీన్ అండ్ గ్రీన్‌లో పాల్గొన్న సీఐ సుబ్బారావు, సిబ్బంది

మార్కాపురం టౌన్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సుబ్బారావు హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం మార్కాపురం పట్టణంలో మద్యం బహిరంగంగా తాగుతున్న ప్రాంతాలను గుర్తించి క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాలపై పోలీసుల నిఘా పెడుతున్నట్లు చెప్పారు. ఎస్వీకేపీ కళాశాల, మార్కెట్ యార్డు, వై జంక్షన్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఆయన వెంట టూ టౌన్ ఎస్సై రాజమోహన్, ఏఎస్సై వెంకటేశ్వర్లు ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


వెలుగొండలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

కొనకనమిట్ల: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని వెలుగొండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఇబ్రహీం పేర్కొన్నారు. మండలస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలను శుక్రవారం మండలంలోని వెలుగొండ గురుకుల పాఠశాల పాఠశాల మైదానంలో పాఠశాలల క్రీడాకారులకు ఆటల పోటీలు ప్రారంభించారు. పోటీలలో కొనకనమిట్ల, గొట్లగట్టు, చినారికట్ల, పెదారికట్ల, మర్రిపాలెం, రేగడపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలు, వెలుగొండ గురుకుల పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనగా వారికి కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా, చెస్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఆయా పాఠశాలల క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పీఈటీలు ఉప్పటూరి శ్రీనివాసులు, సుఖునాభి, వనజలత, పెద్దన్న పాల్గొని క్రీడాకారులకు సలహాలిచ్చారు.

డ్రంక్ డ్రైవ్ నిందితుడికి జైలు శిక్ష

గిద్దలూరు రూరల్: మద్యం తగి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తికి రూ.10 వేల జరిమానాతోపాటు 2 రోజుల జైలు శిక్ష విధించినట్లు శుక్రవారం గిద్దలూరు జూనియర్ సివిల్ జడ్జి భరత్‌చంద్ర తీర్పు వెల్లడించినట్లు సీఐ కె.సురేష్ తెలిపారు. అలాగే బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న మరొకరికి రూ.1000 జరిమానా విధించారని పేర్కొన్నారు.

దస్తావేజుల తయారీని సరళీకృతం చేయాలి


కంభంలో నిరసన వ్యక్తం చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు


మార్కాపురంలో సమ్మె చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

కంభం: దస్తావేజుల తయారీలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని దస్తావేజు లేకరుల అధ్యక్ష కార్యదర్శులు ఆకుల మురళి, షేక్ మస్తాన్‌వలి కోరారు. శుక్రవారం కంభం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట డాక్యుమెంట్ రైటర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటిపి విధానాన్ని రద్దు చేసి, డాక్యుమెంట్ తయారు చేసే సమయంలో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించాలన్నారు. చిన్న చిన్న తప్పులు దొర్లినా మార్పులకు అవకాశం లేకపోవడంతో దస్తావేజుల తయారీలో తీవ్ర జాప్యం ఏర్పడుతోందన్నారు. వీలునామాలను పాత పద్ధతిలో సరళీకృతం చేయాలని కోరారు. నిరసన కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన కొన్ని విధానాల వల్ల ప్రజలతోపాటు తాము కూడా ఇబ్బందులు పడుతున్నామని దస్తావేజు లేకరులు పేర్కొన్నారు. శుక్రవారం పెన్‌డౌన్ చేపట్టి స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. దస్తావేజు లేకరుల సంఘ కార్యదర్శి సుబ్బారావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటీపీ, స్థానిక సంస్థల డేటాబేస్ ఆధారంగా ఇంటి ఆస్తుల కార్డు ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌లోని సాంకేతిక లోపాల వల్ల డాక్యుమెంట్ తయారీ కష్టతరంగా మారిందని, తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ఈ విధానాల్లో మార్పు అవసరమని ప్రభుత్వానికి నివేదిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో దస్తావేజు లేకరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ సెలక్షన్‌కు 30 మంది విద్యార్థులు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

మార్కాపురం: డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ అటానమస్ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్ ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో ఈ విద్యా సంవత్సరానికిగాను శుక్రవారం నిర్వహించిన ఎన్‌సీసీ సెలక్షన్‌లో 30 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు తెలిపారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కెప్టెన్ అనిల్ ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థులు ఎంపిక ప్రక్రియలో పాల్గొనగా 30 మందిని సెలెక్ట్ చేసినట్లు చెప్పారు. వీరిలో 19 మంది బాలికలు ఉన్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల టెక్నికల్ అడ్వయిజర్ డాక్టర్ ఎ.సురేష్ అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు సత్నాం సింగ్, సంతోష్‌సింగ్, డీస్ మస్తానయ్య, డానియల్ తదితరులు పాల్గొన్నారు.

పత్రిక ప్రకటన

నా క్లయింటు అయిన ప్రకాశం జిల్లా మార్కాపురం టౌన్ ఇంటి నెం.1-2003-Z-10-A పవర్ ఆఫీస్ దగ్గర గల వాస్తవ్యులు దూదేకుల నాగూర్ వలి, తండ్రి చిన్న హుస్సేన్ ప్రకాశం జిల్లా, మార్కాపురం టౌన్, ఇంటి నెం 4-88-D, చిన్న మస్జిద్ వీధి వాస్తవ్యురాలు అయిన షేక్ హసీనా, భర్త షౌకత్ అలీ గారిపై మార్కాపురం సబ్-రిజిస్టర్ ఆఫీస్ నందు రిజిస్టర్ కాబడిన డాక్యుమెంట్ నెంబర్ 2300/2020 రు క్రింది తెలుపబడిన షెడ్యూల్ ఆస్తిని కొనుగోలు చేయుటకు వారు ఇరువురు అంగీకరించినారు. కావున ఈ షెడ్యూల్ ఆస్తి కొనుగోలులో ఎవరికైనా అభ్యంతరాలు ఉన్న యడల మరియు అభ్యంతరాలు ఉన్న యడల తెలుపవలసినదిగా కోరడమైనది.

ఆస్తి షెడ్యూల్: ప్రకాశం జిల్లా, మార్కాపురం ఆ.డి., మార్కాపురం సబ్.డి., మార్కాపురం మున్సిపాలిటీకి చెందిన మార్కాపురం గ్రామ ఇలఖా గ్రామ (వర్కర్స్ కాలనీలో) సర్వే నెంబర్. 446లో 212చ॥గ॥లు లేక 178.08 చ॥మీ॥లు దాఖలా ఖాళీ స్థలమునకు హద్దులు. **తూర్పు:** దేసిరెడ్డి కాశిరెడ్డి గారి స్థలం, **పడమర:** సులాకి దివ్యోజీరావు గారి స్థలం, **ఉత్తరం:** 18 అడుగుల వెడల్పు గల జాయింటు రస్తా, **దక్షిణం:** గొంట్ల పద్మావతి ఇతరులకు విక్రయించిన స్థలం.

ఎవరికైనా అభ్యంతరాలు ఉన్న యడల మరియు అభ్యంతరాలు ఉన్న యడల 10 రోజులలో తెలుపవలసినదిగా కోరడమైనది.

చిలకపాటి రామకృష్ణుడు
అడ్వకేట్, మార్కాపురం.సెల్: 6301339726